## నేడు పరిగికి మంత్రి శ్రీధర్‌బాబు రాక

పరిగి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని తుంకులగడ్డలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి, దోమ మండలం మోత్కూరులో మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

### మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి

# చకచకా ఏర్పాట్లు

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్/తాండూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం తాండూరు జిల్లా ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, నిర్మాణ దశలో ఉన్న నర్సింగ్ కళాశాల భవనాలను పరిశీలించారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన మెటీరియల్, టీచింగ్ స్టాఫ్, అధికారుల నియామకం పూర్తయిందని, ఇతర సామగ్రి సిద్ధంగా ఉందని తెలిపారు. సమయపాలన పాటించాలని వైద్యులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భిణులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కాసేపు రోగులతో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. జిల్లా ఆస్పత్రిలో పైకప్పు లీకేజీ, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, సూపరింటెండెంట్ డాక్టర్ సునిత, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజు, జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ ఆనంద్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఎంపీడీవో విశ్వ ప్రసాద్ ఉన్నారు.

#### ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎల్‌ఆర్‌ఎస్ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను పీఎంఏవై గ్రామీణ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి లేని వారి నుంచి లిఖితపూర్వకంగా అంగీకారం తీసకొని, వారి స్థానంలో అర్హులను ఎంపిక చేసేందుకు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు తక్షణమే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10,398 ఇళ్లు మంజూరయ్యాయని, 5,419 ఇళ్లు గ్రౌండింగ్ పూర్తయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, పీడీవోలు, పీడీ హౌసింగ్, ఏఈలు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

బెల్కటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం జడి వాన కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల వరద నీరు చేరడంతో పంటపొలాలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిత్తడిగా మారిన రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. పలు చోట్ల ఇళ్లు కూలిపోయాయి. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరో రెండు రోజులు భారీ వర్ష సూచన ఉండడంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 23**

# జడివాన

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు వంకలు
- దెబ్బతిన్న పంటపొలాలు
- చిత్తడిగా మారిన రోడ్లు
- ఇళ్లలోకి చేరిన వరద నీరు
- అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

**రెండు, మూడు రోజులు భారీ వర్ష సూచన**

ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వాగులు వంకలు పారాయి. పరిగిలోని లక్నాపూర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. మరో భారీ వర్షం పడితే అలుగుపారే అవకాశం ఉంది. పరిగి మునిసిపల్ పరిధిలోని రోడ్లు, పూడూరు మండలం కంకల్ రోడ్డు బురదమయంగా మారాయి. కులకచర్ల మండలం కుసుమసంద్రం గ్రామానికి చెందిన విజయలక్ష్మీ ఇల్లు వర్షానికి కూలింది. కులకచర్ల, చౌడాపూర్, దోమ ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరింది. మొక్కజొన్న, జొన్న చేన్లలో నీరు చేరడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

#### నిలిచిన రవాణా.. ఇళ్లలోకి వరద

తాండూరు నియోజవర్గం పరిధిలో కురిసిన భారీ వర్షానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి కురిసిన

మిగతా 8వ పేజీలో...

**వర్షపాతం వివరాలు (మి.మీలలో)**

| | |
|---|---|
| వికారాబాద్ | 84.3 |
| ధారూరు | 80.0 |
| పరిగి | 75.5 |
| యాలాల | 73.3 |
| పూడూరు | 75.3 |
| తాండూరు | 67.8 |
| పెద్దేముల్ | 44.8 |
| దోమ | 34.5 |
| ఘట్‌కేసర్ | 40.5 |
| కీసర | 30.8 |
| షాబాద్ | 40.5 |
| చేవెళ్ల | 37.5 |
| శంషాబాద్ | 36.8 |
| మొయినాబాద్ | 32.3 |
| కందుకూరు | 24.5 |
| మేడ్చల్ | 21.5 |



కొడంగల్: నాగారం వద్ద వంతెన పక్కన కొట్టుకుపోయిన రోడ్డు

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు వికారాబాద్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం, రోడ్లు తెగిపోవడంపై, ఏదైనా సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 8416 242136, 7995061192ను సంప్రదించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని పర్యవేక్షిస్తుందని, రెండు మూడు రోజులు వర్షాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



పెద్దేముల్ మండలం ఇందూరులో అర్ధరాత్రి ఇళ్లలోకి చేరిన వరద నీరు



పూడూరు మండలం కంకల్ రోడ్డు దుస్థితి



తాండూరు రూరల్: నిలిచిపోయిన లారీలు

## ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ

**జిల్లా వైద్యాధికారి లలితాదేవి**



వికారాబాద్: మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లలితాదేవి

వికారాబాద్/మోమిన్‌పేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని జిల్లాలోని ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహిస్తామని జిల్లా వైద్యాధికారి లలితాదేవి అన్నారు. బుధవారం ఐడీఓసీ కాంప్లెక్స్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో 15 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రతి మంగళవారం కనీసం 70 మంది మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారిని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ ఆశిత సింగ్, ఎంహెచ్‌ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

#### సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి అన్నారు. మోమిన్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. గతేడాది మండలంలో నమోదైన డెంగీ, మలేరియా కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.



మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి వద్ద డంప్ యార్డు

### చెత్త తరలింపు

# వట్టి మాటేనా?

## ఏడాదిగా ముందుకు సాగని ప్రణాళిక

- నిధుల లేమితో జవహర్‌నగర్‌కు కదలని చెత్త
- స్థానికంగానే రెండు చోట్ల డంపింగ్
- అత్వెల్లి వాసులకు తప్పని తిప్పలు

మేడ్చల్ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డులకు తాళం పడనుంది. ఇంటింటికీ వెళ్లి సేకరించే చెత్తను జవహర్ నగర్ డంపింగ్ గార్డుకు తరలించటానికి చర్యలు చేపడుతున్నాం'. అని అధికారులు చేసిన ప్రకటనలు ఉత్తుత్తి మాటలుగా నిలిచాయి. గతేడాది మేడ్చల్ పట్టణంలో సేకరించే చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించే ప్రతిపాదనను అధికారులు ఉన్నతాధికారులకు పంపారు. దీనిపై స్పందించిన అధికారులు

మిగతా 8వ పేజీలో...

#### నిరసనలు చేపట్టినా..!

అత్వెల్లి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలంలో ఉన్న డంపింగ్ యార్డుకు చాలావరకు చెత్త తరలిస్తున్నందున పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డులో నిత్యం కాలుతున్న చెత్తతో వాయు కాలుష్యం పెరిగి స్థానికులు ఇబ్బందుల పాలవుతున్నారు. విసుగెత్తిన స్థానికులు చెత్త తరలించే వాహనాలను అడ్డుకొని నిరసనలు చేపట్టిన ఘటనలు ఉన్నాయి.

## ప్రశాంతంగా విద్యాసంస్థల బంద్



వికారాబాద్‌లో కళాశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

వికారాబాద్/మేడ్చల్, జూలై 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతుల కల్పన, సమస్యల పరిష్కారం, ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణ, విద్యా శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి అక్బర్, ఉపాధ్యక్షుడు తేజ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. గురుకులాలకు సొంత భవనాలు, ప్రతి మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రెహాన్ సిద్దు, నరేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

#### మేడ్చల్ జిల్లాలో బంద్ ప్రశాంతం

వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ పిలుపుతో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో బుధవారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై స్పందన లేకపోవడంతో బంద్‌కు పిలుపునిచ్చినట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యా శాఖ మంత్రిని వెంటనే నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, కేజీబీవీలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి జిల్లాలో పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



కుత్బుల్లాపూర్‌లో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, జూలై 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బుధవారం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి పలు విభాగాలను కలియతిరిగారు. సదుపాయాలు, వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ కాలేజీలను పరిశీలించి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు.





**శాకంబరిగా కల్యాణ కామేశ్వరి**



అషాఢ మాసం సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లోని కల్యాణ కామేశ్వరి నవశక్తి ఆలయంలో బుధవారం అమ్మవారిని రకరకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అమ్మవారితోపాటు తొమ్మిది మంది అమ్మవార్లను సైతం అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్యామ్, ఆలయ ట్రస్టీ శివ, ప్రసాద్, పూజారులు కాశి కోటేశ్వర శర్మ, శివ, కమిటీ సభ్యులు వీరేశం, వీఎస్ఎన్ మూర్తి, మనోజ్, మహిపాల్ రెడ్డి, సంగీత దంపతులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్, జూలై 23(ఆంధ్రజ్యోతి)**



**బుడతల బోనం.. కదిలొచ్చిన జనం**

ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఊరూరా బోనాల సందడి నెలకొంది. పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ ప్రగతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు బోనమెత్తి ఊరడమ్మకు నైవేద్యం సమర్పించారు. అది చూసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొందరు చిన్నారులు పోతరాజుల వేషధారణలో అలరించారు.

**- పెద్దేముల్, జూలై 23(ఆంధ్రజ్యోతి)**


లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

## అర్హులందరికీ రేషన్ కార్డులు

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల/నవాబుపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల ఎండీవో కార్యాలయంలో మండలంలోని పదిమంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రజలందరికీ కొత్త రేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 25 మందికి రూ. 11లక్షల 3వేల 500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. తహసీల్దార్ బి. కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, రాములు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో రేషన్‌కార్డుల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. 19మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ, డీటీ శ్రీలత, ఆర్ఐలు రజిత, రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నీటి వృథాను అరికట్టండి

దోమ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్‌పల్లి రంగనాథ్ కుంట నుంచి నీరు వృథాగా పోతోందని, దానికి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం ఇచ్చారు. కొందరు రైతులు తమ పొలాలు మునుగకుండా తూము నుంచి నీటిని వదుల్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


మహాలక్ష్మి సంబరాల్లో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ బస్ స్టాండ్‌లో డీఎం అరుణ ఆధ్వర్యంలోఆర్టీసీ 'మహాలక్ష్మి' సంబరాలు నిర్వహించారు. హాజరైన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 200కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): 1947 దేశ విభజన సమయంలో కాందీశీకులు వదిలివెళ్లిన సుమారు 7ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఆ భూమిలో ఇప్పుడు ఎకరం 10గంటల భూమిని కొందరు కాజేసేందుకు దొంగ పట్టాలు సృష్టించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అదనపు కలెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి సుధీర్‌కుబీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడెకరాల్లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఇతర అవసరాలకు వాడారన్నారు. భూమి కాజేసేవారికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వచ్చిందని, ఈ భూమి 100శాతం ప్రభుత్వానిదే అన్నారు. మునిసిపాలిటీ హైకోర్టులో అప్పీల్ చేయాలని అధికారిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మారుతీకిరణ్, కేశవులు, ఉగ్ర నర్సింహ, ప్యాట శంకర్, సుధాకర్, మోహన్‌రెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

దుద్యాల: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిని మండలంలోని హకీంపేట్‌కు చెందిన నాయకులు వికారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శివకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి




బాణాపూర్ గ్రామంలో మల్లప్పకుంట చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

## మల్లప్ప చెరువు లీకేజీ

● సందర్శించిన తహసీల్దార్...మరమ్మతులకు ఆదేశం

యాలాల, జూలై 23, (ఆంధ్రజ్యోతి) : యాలాల మండల పరిధిలోని బాణాపూర్ గ్రామంలో గల మల్లప్ప చెరువు లీకేజీలకు గురైంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా చెరువుకుంటలో నీరు చేరింది. పెద్ద ఎత్తున మల్లప్పకుంటలో నీరు చేరడంతో చెరువు కట్ట కింద భాగంలో నుంచి వర్షం నీరు లీకేజీ అవుతుంది. దీంతో గ్రామస్తులు యాలాల తహసీల్దార్‌కు సమాచారం అందించారు. తహసీల్దార్ వెంకటస్వామి మల్లప్పకుంట చెరువును పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు.



## ఎన్కతలలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

మోమిన్‌పేట్, జూలై23(ఆంధ్రజ్యోతి): ఎన్కతల గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర పరిశీలకులు కృష్ణ, భారత్‌మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవి, డీఎల్పీవో సంధ్యారాణి బుధవారం సందర్శించారు. పారిశుధ్య పనులు, మరుగుదొడ్ల నిర్వాహణ, ఇంకుడు గుంతలు, తడి, పొడిచెత్త సేకరణ, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మధ్యాహ్న భోజనం గురించి గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సిములు, సిబ్బంది గంగయ్య, పోచయ్య, నాగరాజు, ఏఎన్ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్, వీవోఏలు, పాల్గొన్నారు.

# దోమకాటుతో జాగ్రత్త

» ప్రాణి చిన్నదే.. తలపెట్టే హాని పెద్దది! » కుట్టకుండా చూసుకోవాలి

కొడంగల్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండక్షరాల చిన్న ప్రాణి దోమ. అయితే మనిషికి చేసే ముప్పు మాత్రం పెద్దది. వర్షాకాలంలో అన్ని రకాల అంటు వ్యాధులను దోమ మనుషులకు చేరవేస్తూ ఆస్పత్రుల పాల్జేస్తోంది. అయితే జాగ్రత్తలతో దోమకాటుకు గురికాకుండా చూసుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లోనే దోమలు గుడ్లు పెట్టి సంతానాన్ని వృద్ధి చేస్తాయి. ఈ గుడ్లు వాతావరణంలోని వేడితో మూడు రోజుల్లో లార్వాగా బయటకొచ్చి ప్యూపాగా మారతాయి. అనంతరం దోమలుగా మార్పుచెందుతాయి. చాలా రకాల అంటు వ్యాధులు దోమ వల్లే వ్యాపిస్తాయి. దోమ కాటుతో ప్రధానంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, బోధకాలు తదితర వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులున్న వారిని దోమలు కాటేసిన అనంతరం ఇతరులను కుడితే ఆ వైరస్‌తో ఆరోగ్యవంతులకు సైతం వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధుల లక్షణాలన్నీ దాదాపు ఒకే రకంగా ఉంటాయి.


పాటిమీదిపల్లిలో ఇళ్ల మధ్య పేరుకున్న గుర్రపుడెక్క

ఇవి తప్పక పాటించాలి

- ఆవాస ప్రాంతాల వద్ద, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇళ్లలో ప్రతీ మూలలో వెలుతురరొచ్చేలా చూసుకోవాలి.
- దోమలు కట్టుకుండా దోమ తెరలను వాడాలి.
- ఇళ్లలో వాడే కూలర్లలో ఎప్పటికప్పుడు నీటిని మార్చాలి.
- పిల్లలను పడుకోబెట్టినప్పుడు కాళ్లు, చేతులకు దోమల నివారణ క్రీములను రాయాలి.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దోమలు కుడితే వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలి. ఇంటి సమీపంలో ఎక్కడా నీటి నిల్వ ఉంచొద్దు. గుంతలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఎవరైనా అస్వస్థకు గురైతే వెంటనే ఆస్పత్రిలో చికిత్స పొందాలి.

- డాక్టర్ చందనప్రియ, ప్రభుత్వ ఆసుపత్రి, కొడంగల్


పోచారంలోని టౌన్‌షిప్‌లో పర్యటిస్తున్న రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతమ్

## రాజీవ్ సద్భావన టౌన్‌షిప్‌లో ప్లాట్ల విక్రయాలు

● రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతం వెల్లడి

ఘట్‌కేసర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేద మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరల్లో ఇళ్లను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌సద్భావన టౌన్‌షిప్‌లో ఆయన పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ నిర్మించిన ఈ టౌన్‌షిప్‌ను 30ఎకరాల్లో 60శాతం ఓపెన్‌స్పెస్‌తో పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ఇళ్లను వేలం వేయకుండా పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సింగిల్ బెడ్‌రూం ఇంటిని రూ. 13 లక్షలకు, డబల్‌బెడ్ రూం ఇళ్లు రూ, 25లక్షలకు వస్తుందన్నారు. ప్రస్తుతం ఉప్పల్ నుంచి రావడానికి అరగంట సమయం పడుతున్నప్పటికి నారపల్లి – ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే కేవలం 10నిముషాల్లో ఉప్పల్ చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రసుత్తం పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో 255 సింగిల్ బెడ్‌రూంలు. 350డబల్ బెడ్ రూంలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సింగిల్ బెడ్‌రూం కోసం రూ.లక్ష, డబల్ బెడ్‌రూం కోసం రూ, 2 లక్షలు ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ అప్పలరాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తో విసిగిపోయిన ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న కోట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు అనిల్

వికారాబాద్/కోట్‌పల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన, చేస్తున్న మోసాలతో ప్రజలు విసిగిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బంట్వారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్‌ల తరఫున కాంగ్రెస్, బీజేపీల నాయకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వెళ్లి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ కండువాలు కప్పారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి భారీఎత్తున బీఆర్ఎస్‌లో చేరతారన్నారు. కాగా కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వికారబాద్‌కు చెందిన యువ నాయకుడు చైతన్య రూపొందించిన 'యువ చైతన్యం' పాటల సీడీని కేటీఆర్ ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, నాయకులు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, శుభప్రద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోట్‌పల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల నుంచి 150 మంది నాయకులు బీఆర్ఎస్ లో చేరారని తెలిపారు.

## సింహగర్జన సభకు తరలిరండి

పెద్దేముల్, జూలై23(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో ఆగస్టు 2న నిర్వహించే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నర్సిములు పిలుపునిచ్చారు. ఇందూరులో బుధవారం దివ్యాంగులు, వృద్ధులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధుల పింఛన్‌ను 4వేలకు, దివ్యాంగులకు 6వేలకు పెంచాలన్నారు. హక్కుల సాధన కోసమే ఈ సింహగర్జన సభ నిర్వహిస్తామన్నారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. మండలం నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జూలై23(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొత్కుళ్లగూడ నుంచి కేసారం వరకు బీటీ రోడ్డు, రూ.58 లక్షలతో శ్రీనివాసులగూడ నుంచి మజీద్ మామిడిపల్లి వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, బండోనిగూడ నుంచి తండా వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. శివశంకర్‌గౌడ్, నర్సింలు, పసుల బుచ్చయ్య, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలికృష్ణ, సత్తయ్య, నర్సింలు, హరినాథ్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, రవిందర్, శేఖర్, శ్రీశైలం, శివ, సాములయ్య, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

### రక్తదానంతో సాటి మనిషికి పునర్జన్మ

షాద్‌నగర్ అర్బన్ : రక్తదానం చేయడమంటే తోటి మనిషికి పునర్జన్మ ఇచ్చినట్టేనని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు. చటాన్‌పల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ చేగూరి రాజేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని రెడ్డిసేవా భవన్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 34 మంది రక్తదానం చేశారు. 250 మందికి కంటి పరీక్షలు, 300 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.మదన్‌మోహన్ రెడ్డి, రాజు, శివనాగయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, అశోక్, నర్సింహారెడ్డి, వెంకట్‌నాయక్, ఎర్ర శ్రీనివాస్, చందు పాల్గొన్నారు.


మొత్కుళ్లగూడలో బీటీపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్


యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

## తెలంగాణలో అధికారంలోకి వస్తాం

● టీడీపీ రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి

యాచారం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని, పార్టీకి పూర్వవైభవం తేవడానికి ప్రతీ కార్యకర్త శ్రమించాలని తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చిత్తశుద్ధితో పని చేస్తూ పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించాలని, తనవంతు సహకారమందిస్తానని అన్నారు. నక్క మహేందర్‌యాదవ్, కొంగళ్ల మల్లారెడ్డి, కొంగర జంగయ్య, కె.యాదయ్య, బుచ్చిరెడ్డి, చింతకింది చక్రపాణి, శ్రీరాములు, గౌరనర్సింహ, నారిమల్ల యాదయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ మండల కమిటీ


తెలుగుదేశం పార్టీకి మండల కమిటీ నియమించారు. అధ్యక్షుడిగా గౌర నర్సింహ, ఉపాధ్యక్షుడిగా నక్క మహేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అర్జున్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాళ్ల నరసింహగుప్తా, నర్రె యాదగిరి, కార్యదర్శులు కె.యాదయ్య, రవీందర్, డి.యాదయ్య, కోశాధికారిగా దాసులు ఎంపికయ్యారు.

## వానలు.. అప్రమత్తంగా ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తతే ప్రమాదాల నివారణకుఆయుధమని, వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. బుధవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొన్ని కాలనీలు జలమయ్యే అవకాశాలున్నందున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

## తాండూరులో హస్తకళా ప్రదర్శన




తాండూరు, జూలై 23(ఆంధ్ర జ్యోతి): హస్తకళల ప్రోత్సాహానికి తాండూరులో 'చేనేత వస్త్రం' పేరిట ఎగ్జిబిషన్‌ను చేనేత, జౌళి శాఖ ఏర్పాటు చేసింది. తాండూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎగ్జిబిషన్ కొనసాగుతోంది. 'స్వదేశీ హస్తకళలు' నిర్వహిస్తున్న మేళాలో అమ్ముతున్న దుస్తులు ఆకట్టుకుంటున్నాయి. పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్, జరీ, పట్టు చీరలు, పోచంపల్లి డ్రెస్‌మెటీరియల్, షూటింగ్, షర్టింగ్స్, అలాగే కట్లు, అల్లికల వస్తువులు అమ్ముతున్నారు. పది రాష్ట్రాల చేనేత కళాకారులు చేసిన వస్తువులు, దుస్తులను ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తున్నారు.

## 'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలని సూచించారు. మాడ్గుల మండల బీజేపీ కార్యకర్తల సమావేశం బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం స్థానిక సమస్యలపై చర్చించారు. ఆచారి మాట్లాడుతూ మోదీ పాలనా దక్షతతో దేశం పదేళ్లలో అద్భుత విజయాలు సాధించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని, బీఆర్ఎస్‌ను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌని మల్లేశ్‌గౌడ్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నర్సింహ్మ, రాష్ట్ర నాయకుడు మట్ట వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## మహిళా సాధికారతకు పెద్దపీట

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఖర్చు రూ.6,700 కోట్లు అని అన్నారు. విజయవంతంగా కొనసాగుతున్న మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోలతో పాటు 341 బస్‌స్టేషన్లలో సంబురాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమనగల్లులో నిర్వహించిన సంబురాలలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు అవుతుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. డీఎం సుభాషిణి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

## ఉత్సవానికి రావాలని ఆహ్వానం

ఘట్‌కేసర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పలు వార్డుల్లో ఈ నెల 27న జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ బుధవారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. బోయిన్‌పల్లిలో గల నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. ఆదివారం పోచారం, యనంపేట్, అన్నోజిగూడ, ఆర్జీకే కాలనీల్లో బోనాలు, ఫలాహార బండ్ల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నల్లవెల్లి శేఖర్, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రశాంత్, చక్రపాణి ఉన్నారు.

## బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలి

దౌల్తాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీలకు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రెండో పీఆర్సీ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలకులు గత ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పేస్కేల్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఉశన్న, రమేశ్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ

## ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించాలి

**» చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ**

మొయినాబాద్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోయే గోశాల నిర్మాణానికి ఎన్కేపల్లి రైతులు సహకరించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ కోరారు. బుధవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆర్డీవో, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. సాగులో ఉన్న భూములను ఇచ్చేదిలేదని రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముందుగా 300 గజాల స్థలాలు ఇచ్చిన తరువాతనే ఇక్కడ గోశాల నిర్మాణం చేయడం జరుగుతుందని వారికి వివరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎన్కేపల్లి గ్రామస్తులు స్వాగతించాలని కోరారు.అంతకు ముందు మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్, ఏసీపీ కిషన్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో పాటు గ్రామ రైతులతో మాట్లాడారు.



వైపీఆర్ కమాన్ వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

## ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్



చర్లపటేల్‌గూడలోని నోరుతెరుచుకున్న మ్యాన్‌హోల్

ఆదిభట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్ గూడ, ఆదిభట్ల మున్సిపాలిటీలో మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వర్షకాలం నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డు వేసి మ్యాన్‌హోల్స్ నిర్మాణం పూర్తిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై నీటితో పాటు మురుగు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. టీసీఎస్ నుంచి ఆదిభట్లకు వెళ్లే రోడ్డులో నిత్య మురుగు నిలుస్తుండటంతో అపరిశుభ్రత, దుర్వాసనతో స్థానికులకు, వాహనదారులకు, టీసీఎస్ ఉద్యోగస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీవో గ్యామానాయక్, ఎంఈవో వెంకట్, డీటీ నర్సిములు అన్నారు. బుధవారం దోమలోని బాలికల పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. బాలికలతో కలిసి భోజనం చేశారు.



## డిమాండ్లను నెరవేర్చాలి

కీసర రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారత్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీటీసీ సురేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీఎంఎస్ ప్రతినిధులు రాఘవేందర్, పురుషోత్తం, ప్రవీణ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## ఓంకారేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చౌడాపూర్ మండలంలోని మందిపాల్‌లోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుకున్నారు. గణపతి వీరభద్ర, నందీశ్వర మహాన్యాస, ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

చౌడాపూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి)



## షూటింగ్ స్పాట్‌గా ఎర్రవల్లి

వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లి గ్రామం షూటింగ్ స్పాట్‌గా మారుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగుల ఎలమ్మ ఆలయం పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా మారింది. బుధవారం 'నేను నా లల్లీ' వెబ్ సిరీస్ చిత్రీకరణ జరుగగా గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు షూటింగ్ చూసేందుకు తరలివచ్చారు.

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి)

## వరద కష్టాలు తీరుస్తాం

తాండూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో ప్రజలు ఎదుర్కొంటున్న వరద కష్టాలను త్వరలోనే పరిష్కరిస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆర్టీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బుధవారం చిలుకవాగు బ్రిడ్జి మార్కేండయ కాలనీని పరిశీలించారు. రూ.16కోట్లతో బ్రిడ్జి పనులు చేస్తున్నామని, దీంతో జలమయమయ్యే ప్రాంతాలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆయనతో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు వికాస్‌జోషి, విష్ణు, కాలనీ పెద్దలు ఉన్నారు.

# బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారమందించాలి

**» కలెక్టర్‌కు కడ్తాల రైతుల వినతి**



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

కడ్తాల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రైతులు, పలువురు నాయకులు కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీదర్ నుంచి మహేశ్వరం వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ టవర్లు, లైన్ల మూలంగా కడ్తాలతో పాటు సమీప గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కడ్తాల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి రూ.20వేలు పలుకుతుందని, దానికి అనుగుణంగా పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కడ్తాల మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు, రైతులు రాములు, పెంటారెడ్డి, శ్రీరాములు, పర్వత్‌కుమార్, శ్రీశైలం, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జీఎస్ కోహ్లీ

## గురునానక్ వర్సిటీలో బీటెక్ ప్రోగ్రాంలు

**» సాప్ టెక్నాలజీస్ సమన్వయంతో ప్రారంభం**

ఇబ్రహీంపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడంతోపాటు నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీ, సాప్ (ఎస్ఏపీ) టెక్నాలజీస్ సమన్వయంతో నూతనంగా బీటెక్ ప్రోగ్రాంలను ప్రారంభించినట్లు గురునానక్ యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ తెలిపారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రోగ్రాంను ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య సమన్వయం ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రోగ్రాం ప్రవేశపెట్టామన్నారు. ఇది ఒక సాధారణ కోర్సు కాదని. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ యుగంలో విద్యార్థులు ప్రపంచ ప్రొఫెషనల్స్‌గా ఎదగడానికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సాప్ ఇండియన్ సబ్ కాంటినెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ ప్రోగ్రాం తీసుకువచ్చామన్నారు. విద్యార్థులకు ఇది ఒక ప్రాక్టికల్ శిక్షణగా ఉపయోగపడుతుందని, డిజిటల్ ఎకానమీకి అనుగుణంగా కోర్సులను రూపొందిస్తూ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెంచే దిశగా కృషి జరుగుతుందన్నారు. ప్రముఖ ఐటీ సంస్థలైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, యూఎస్‌టీ వంటి పలు సంస్థల ప్రతినిధులతోపాటు వైస్ చాన్స్‌లర్ డా.హెచ్.ఎస్ సైనీ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వినయ్ చోప్రా తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను దుర్వినియోగం చేయొద్దు

నందిగామ/చౌదరిగూడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): యూరియాను పంటల సాగుకు తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించొద్దని అధికారులు సూచించారు. ఈమేరకు నందిగామ మండల కేంద్రంలోని యూరియాను వినియోగించే శ్రీ లక్ష్మీనివాస్ ప్లేట్స్, మిల్క్‌ప్లస్ ఫుడ్, హర్ష ప్లైవుడ్ పరిశ్రమను బుధవారం వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే యూరియాను పరిశ్రమల్లో తయారుచేసే పదార్థాలు, వస్తువుల్లో వినియోగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రైతులు పంటలకు వినియోగించే యూరియాను పరిశ్రమలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయశాఖ అధికారులు ఉష, రమాదేవి, రామశివరావు, పోలీస్ అధికారి గోపాల్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే యూరియాను ఇతరత్రా అవసరాలకు వినియోగించడం నేరమని కొందుర్గు ఏవో సురేష్‌రెడ్డి అన్నారు. కోళ్ల ఫారాల్లో యూరియాను వినియోగిస్తున్నారనే సమాచారంతో మండల పరిధిలోని తంగెళ్లపల్లి గ్రామ శివారులోని గీత పౌల్ట్రీ పరిశ్రమ, నాగార్జున హేచరీస్‌లో తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో యూరియా వినియోగం లేనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్సై రవీందర్ నాయక్‌లు పాల్గొన్నారు.



ప్లైవుడ్ పరిశ్రమను తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు

# లారీ ఆపి డబ్బు డిమాండ్

**● ఏఎంసీ చైర్మన్ అనుచరుడి హల్‌చల్ ● పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు**

మూడుచింతలపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ పీఏను అని చెప్పుకుంటూ కాంగ్రెస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి కీసరి భానుచందర్ వసూళ్లకు పాల్పడుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి భానుచందర్, మరో ఇద్దరు ఓ టిప్పర్ లారీని ఆపి డబ్బు డిమాండ్ చేశారు. డబ్బులివ్వలేదని డ్రైవర్, క్లీనర్, లారీ ఓనర్‌ను, అతడి బావమరిదిని కర్రలతో కొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పర్‌పల్లి రామకృష్ణకు చెందిన టిప్పర్‌లో డ్రైవర్ రామాంజనేయులు, క్లీనర్ షాబాజ్‌లు దత్తాయిపల్లి వైపు వెళ్తున్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మాపూర్ వద్ద పోలీస్ సైరన్‌తో కారు(టీఎస్08 హెచ్‌జీ4449)లో వచ్చిన వారు లారీని అడ్డుకున్నారు. తాము ఆర్టీఏ, మైనింగ్ అధికారులమని కర్రలతో కొడుతూ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో డ్రైవర్ రామకృష్ణకు ఫోన్ చేశాడు. రామకృష్ణ లక్ష్మాపూర్‌లో ఉండే తన బావమర్ది అనిల్‌కు ఫోన్‌చేశాడు. అనిల్ లారీ వద్దకు చేరుకుని కారులోని వారు లక్ష్మాపూర్‌కు కీసరి భానుచందర్, అతడి తమ్ముడు వేణు, మేడబోయిన రాజులుగా గుర్తించారు. మీకెందుకు డబ్బులివ్వాలని ప్రశ్నించగా భానుచందర్, అతడి అనుచరులు రామాంజనేయులు, అనిల్‌లపై దాడి చేశారు. ఈలోగా అక్కడకి చేరుకున్న రామకృష్ణపైనా దాడి చేశారు. బాధితులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల రాకతో నిందితులు పారిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొద్దిరోజులుగా భానుచందర్ పోలీస్ సైరన్ కారుతో వాహనాలను ఆపుతూ డబ్బు డిమాండ్ చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. కాగా దీనిపై నర్సింహులుయాదవ్ స్పందిస్తూ.. ఈ అక్రమ వసూళ్లతో తనకు సంబంధం లేదన్నారు. భానుచందర్ కాంగ్రెస్ కార్యకర్తగానే తెలుసన్నారు.

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

మోమిన్‌పేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవచింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత పొందుతారని ప్రముఖ వక్త నల్లవేలు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం చక్రంపల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. చరిత్రను అధ్యయనం చేస్తూ, జరుగుతున్న పరిణామాలను గ్రహిస్తూ జాగ్రతం కావాలన్నారు. డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, అంజయ్యయాదవ్, ఆధ్యాత్మికవేత్త వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో 150మంది కవులు కవితా గానం విన్పించారు. కార్యక్రమంలో తాండూర్, పరిగి, కొడంగల్, హైదరాబాద్, షాద్‌నగర్, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల కవులు, బందెప్పగౌడ్, విశ్వనాథం, రాజు, వెంకట్, రాఘవేంద్రచారి, సత్యం, మాణిక్యరావు, రాథోడ్, శ్రీనివాస్, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

## ఆస్తికోసం తండ్రిని చంపిన తనయుడు

**వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం గొట్లపల్లిలో ఘటన**

పెద్దేముల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు మంటకలిసిపోతున్నాయి. ఆస్తికోసం అయిన వారిని సైతం చంపడానికి వెనకాడడం లేదు. ఇలాంటి సంఘటనే వికారాబాద్ జిల్లా , పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తలారి హన్మంతుకు ఐదుగురు కుమారులు. హన్మంతు కొంతకాలం క్రితం పక్షవాతానికి గురై ఇటీవలే కాస్త కోలుకుని తనపనులు తాను చేసుకునే స్థితికి చేరుకున్నాడు. ఆయన ఐదుగురు కుమారుల్లో రెండో కుమారుడు రవి జులాయిగా తిరుగుతుండేవాడు. తాగుడుకు బానిసై డబ్బుల కోసం తరుచూ తండ్రిని వేధించేవాడు. తండ్రి హన్మంతు పేరిట కొంత ఆస్తి ఉంది. డబ్బులు ఇవ్వకపోవడంతో రవి కన్ను ఆస్తిపై పడింది. దీంతో తనకు డబ్బులు ఇవ్వకపోయినా తనకు రావాల్సిన ఆస్తిలో తన వాటానైనా తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తెచ్చేవాడు. బుధవారం తండ్రీకొడుకుల మధ్య ఇదే విషయమై గొడవ జరిగింది. తాను ఉన్నంతవరకు ఎవరికి ఆస్తిలో వాటా ఇచ్చేది లేదని తేల్చడంతో కోపోద్రిక్తుడైన రవి తన తండ్రిపై దాడికి దిగి హత్యచేశాడు. అనంతరం స్వయంగా రవినే 100కు డయల్ చేసి తనతండ్రిని తానే హత్య చేశానని చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడు రవి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ.వేణుకుమార్ తెలిపారు.

## సీఎంను కలిసిన నాయకులు



దౌల్తాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అనంతగిరిపల్లిలో బోనాలు



వికారాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆషాఢ బోనాల సందర్భంగా వికారాబాద్‌లోని అనంతగిరిపల్లిలో బుధవారం బోనాలు నిర్వహించారు. గ్రామ దేవతలకు బోనాలతో ఊరేగింపు నిర్వహించగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వేడుకల్లో మాజీ కౌన్సిలర్ అంగోత్ దేవిరెడ్యానాయక్, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాండూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు ఎంపీవో సుశీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులతో మురుగు తొలగించడం, చెత్త శుభ్రం చేయించడం వంటి పనులు చేపట్టాలన్నారు. దోమల నివారణకు మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని కోరారు.

## వ్యాధుల నివారణపై అవగాహన

కొడంగల్, జూలై 23(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పకీరప్ప అవగాహన కల్పించారు. బాలికల వసతి గృహంలో కీటక జనిత వ్యాధుల నివారణ కోసం సిబ్బందితో మందు పిచికారి చేయించారు. దోమల వలన కలిగే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా వ్యాధుల గురించి ఆయన అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు తెలిపారు.

## విద్యా సంస్థల బంద్

తాండూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఫీజు నియంత్రణ చట్టం తేవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వివరించి బంద్ చేయించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలని కోరారు. బస్సుల్లో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

## స్కూళ్లకు కంప్యూటర్ల అందజేత



దుద్యాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు 23కంప్యూటర్‌లను ఎంఈవో విజయరామారావు బుధవారం అందించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన కంప్యూటర్ సెట్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందర్‌నాయక్, సంపత్‌కుమార్, వెంకటయ్య, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీలు జరగకుండా చూడాలి

కీసర రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దొంగతనాల నివారణకు భద్రతాప్రమాణాలు పాటించాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చోరీల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వడ్డీ వ్యాపారులు, నగల వ్యాపారులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాత్రిపూట అధిక నగదును, పెద్ద మొత్తంలో నగలను దుకాణాల్లో ఉండకుండా జాగ్రత్తపడాలని సూచించారు. కొత్త కస్టమర్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రి వేళ సెక్యూరిటీని పెట్టాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# చెత్త తరలింపు వట్టి మాటేనా?

(ఐదో పేజీ తరువాయి)

మున్సిపల్ ఖర్చుతో చెత్త తరలింపునకు అనుమతిచ్చినా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

**రోజూ దాదాపు 30 టన్నుల చెత్త**

జవహర్‌నగర్‌కు చెత్తను తరలించటానికి కావాల్సిన వాహనాలు, ఇతర ఖర్చులకు సంబంధించి ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపగా అందు కు గ్రీన్ సిగ్నల్ లభించింది. డంప్ యార్డులను తీసేసి రోజూ మున్సిపల్ పరిధిలో సేకరించే 20 నుంచి 30 టన్నుల చెత్తను తాత్కాలికంగా డంప్ చేసుకోవటానికి అధికారులు స్థానికంగా మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. దీనిపై వివరాలను కలెక్టర్‌కు పంపడంతో రెండు స్థలాల్లో చెత్త డంపింగ్‌కు అనుమతి వచ్చింది. ఈ డంపింగ్ చేసే స్థలాలు జనావాసాలకు సమీపంలో ఉన్నందున కొందరు రాజకీయంగా ఈ వ్యవహారాన్ని అడ్డుకున్నారు. దీంతో కొద్ది రోజుల పాటు ప్రస్తుతం కొనసాగిస్తున్న అత్వెల్లి డంపింగ్ యార్డులోనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు.

**పాలక వర్గంతోనే గడిచిన ప్రతిపాదన**

జవహర్ నగర్‌కు చెత్త తరలించే ప్రతిపాదనను గత పాలకులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి అనుమతులు పొందినా అధికారులు మాత్రం ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. మున్సిపల్ పాలకవర్గ గడువు ముగిసి వ్యవహారం మొత్తం అధికారుల చేతుల్లోకి వెళ్లింది. వారు చెత్త తరలింపుపై విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ ఖర్చుతో చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించే వ్యవహారం ఖర్చుతో కూడిన పని కావడంతో చెత్త తరలించే ప్రతిపాదనను విస్మరించారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ప్రభుత్వం, పాలకవర్గం రెండూ మారడంతో అత్వెల్లి, మేడ్చల్ రైల్వే కాలనీల సమీపంలో రెండు డంప్ యార్డుల నుంచి తమకు విముక్తి లేకుండాపోతోందని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో స్థానికులు ఉన్నతాధికారులను, కాంగ్రెస్ ప్రముఖులను కలిసి వినతపత్రాలు అందించారు. అయినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు.

# జడివాన

(ఐదో పేజీ తరువాయి)

వర్షానికి కర్మాగారాల లారీలు 12 గంటలపాటు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బెల్కటూర్ వాగు పొంగి ప్రవహించింది. దీంతో కరన్‌కోట్, ఓగీపూర్, చిట్టిఘనాపూర్, కర్నాటక రాష్ట్రంలోని వీకాట్‌సాగర్, పెన్నా సిమెంట్స్, కరన్‌కోట్ ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారాలకు వెళ్లే వందలాది లారీలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని అల్లాపూర్ వాగు, ఐనెల్లి శివారులోని బండలవాగు, సంగెంకలాన్ శివారులోని ముళ్లవాగు పొంగి పొర్లాయి. అలాగే బషీరాబాద్ మండలంలోని నవాంద్గీ వద్ద కాగ్నానది ఉప్పొంగింది. ఒడ్డున ఉన్న సంగమేశ్వరాయలం గర్భ గుడిలోకి నీరు వచ్చి చేరింది. పెద్దేముల్ మండల పరిధిలోని ఇందూరు వాగులోకి వరద ఉధృతి పెరగడంతో సమీపంలోని కొన్ని ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో వంట సామగ్రి, తిండి



బషీరాబాద్: నవాంద్గీ సంగమేశ్వరాలయంలో జలమయమైన గర్భగుడి

గింజలు, వస్తువులు తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్, ఎంపీడీవో రతన్‌సింగ్, కార్యదర్శి బలరాం, గ్రామ పెద్ద నరేందర్ ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ధారూరు బస్‌స్టేషన్ ఆవరణలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో బస్టాండ్ కుంటను తలపించింది. దీంతో వికారాబాద్, హైదరాబాద్, తాండూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

**కొట్టుకుపోయిన రోడ్డు**

కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్, దుద్యాల మండలాల్లో వర్షం కురిసింది. బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్, మదన్‌పల్లి మీదుగా నాగారం వెళ్లేందుకు వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. అక్కల్‌రెడ్డి, తిమ్మాయిపల్లి చెరువులు అలుగుపారాయి. బాలంపేట్, దేవరఫస్లాబాద్ చెరువుల్లో వరద నీరు భారీగా చేరింది.



ధారూరు బస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన నీరు

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పూడూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు

పూడూరు/దోమ/కొడంగల్/బషీరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్య లు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ)ఆధ్వర్యంలో బుధవారం పూడూరు తహసీల్దార్ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... అన్ని క్యాడర్ల బదిలీలు, ప్ర మోషన్ల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎం, ఎస్‌ఏ, పీఎస్‌హెచ్‌ఎం ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు. జీవో-25ను సవరించాలని, ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని 40మంది విద్యార్థులున్న ప్రైమరీ పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడు ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ పోస్టులను కేటాయించాలన్నారు. పెండింగ్ బిల్లులను, రిటైర్డ్ టీచర్ల బెనిఫిట్లను విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌తో డీఈవో, డిప్యుటీ డీఈవో, ఎంఈవో, డైట్, బీఈడీ కళాశాలల అధ్యాపకుల ఖాళీల్లో నియామకాలు చేపట్టాలని డి మాండ్ చేశారు. హెల్త్ కార్డులు, పీఆర్సీ, టైంటేబుల్ వంటి తదితర అంశాలపై డిమాండ్‌లను వారు వివ రించారు. దోమ టీచర్లు తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం అందించారు. పాఠశాలలకు పారిశుధ్య నిధుల మంజూరు, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎ ఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసూరాం, జంగయ్య, ముత్యప్ప, మెగ్యా, రవికుమార్, మల్లేశం, నరేందర్, రామకృష్ణ, ధనేశ్వర్ పాల్గొన్నారు. కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అనితకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నర్సింగ్, అశోక్‌కుమార్, కేసీ.శ్రీనివాసులు, ఎఫ్.నర్సిములు, అశోక్, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. బషీరాబాద్ తహసీల్దార్ షాహీదాబేగంకు ఉపాధ్యాయులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బి.నర్సింహులు, మండల అధ్యక్షులు ఎస్.రవికుమార్, వెంకటప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.



కొడంగల్‌లో వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

# మహిళా సంక్షేమానికి పెద్దపీట



పరిగి బస్‌స్టేషన్‌లో మహాలక్ష్మి సంబురాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో 'మహాలక్ష్మి' పథకం పేరిట మహిళలకు అమలు చేస్తున్న ఉచిత ప్రయాణం ద్వారా రాష్ట్రంలో నేటి వరకు 200కోట్ల మంది ప్రయాణించారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం పరిగి బస్‌స్టేషన్‌లో నిర్వహించిన సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లోకెల్లా మహాలక్ష్మి స్కీం ప్రధానమైందన్నారు. పరిగి డిపోలోనే కోటి 29లక్ష మంది మహిళలు ప్రయాణించారని తెలిపారు. మహిళల భాగస్వామ్యం లేనిది ఏదీ సాధ్యం కాదని, అందుకే ప్రతి పథకాన్ని వారి ద్వారానే అమలు చేస్తున్నామని తెలిపారు. పరిగి బస్ స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

**మహాలక్ష్మి పథకం.. మహిళలకు వరం**

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండనిలుస్తుందని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. మహాలక్ష్మి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి తాండూరు బస్టాండ్‌లో బహుమతులు అందజేశారు. డిపో పరిధిలో కోటీ 30లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం సాగించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి, పట్టణాధ్యక్షుడు హబీబ్ లాల, నాయకురాలు శోభారాణి, డీఎం సురేష్‌కుమార్, ఆర్టీసీ ప్రతినిధి గాండ్ల అరుణ, మాజీ కౌన్సిలర్ నీరజ, ప్రభాకర్‌గౌడ్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**అన్నింటా రాణిస్తున్న మహిళలు**

కులకచర్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. కులకచర్ల బస్టాండ్‌లో నాయకులు మహాలక్ష్మి సంబరాలు జరుపుకున్నారు. 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణించిన సందర్భంగా స్వీట్లు పంచారు. సీఎం రేవంత్ రెడ్డి డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలిస్తున్నారన్నారు. బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, కృష్ణారెడ్డి, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి



కులకచర్ల బస్టాండ్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

## పారిశుధ్య కార్మికులకు సబ్బుల పంపిణీ



కార్మికులకు భోజనం వడ్డిస్తున్న అఫ్జల్‌ఖాన్

శామీర్‌పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): నిస్సహాయులను ఆదుకోవడంలో ఆత్మసంతృప్తి కలుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త అఫ్జల్‌ఖాన్ అన్నారు. ప్రతీ వారంలాగే బుధవారం శామీర్‌పేటలోని తన నివాసంలో అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు సబ్బులు అందజేశారు. సేవా కార్యక్రమాలతో తనకు తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి, సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. పాధ్యాయుడు నర్సింహారెడ్డి, నిస్సార్, అహ్మద్ ఖాన్, రాజు పాల్గొన్నారు.

## 'జల దోపిడీపై నోరు మెదపని సీఎం రేవంత్‌రెడ్డి'

దౌల్తాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏపీ జల దోపిడీపై నోరుమెదపని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీద్దామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కోట్ల మహిపాల్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాల విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టు, ఏపీ ప్రభుత్వ అక్రమ నీటి దోపిడిపై అవగాహన కల్పించారు. కేసీఆర్ సారథ్యంలో నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా ఉద్యమం జరిగిందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ జలదోపిడిపై నోరు మెదపకపోవడం సరైంది కాదన్నారు. బనకచర్ల ద్రోహానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్వీ నిరసనలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, పకీరప్ప, మైపాల్, మధుసూదన్‌రెడ్డి, అశోక్, సంతోష్‌కుమార్, బాల్‌రాజ్, రమేశ్, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### 'ఇన్‌స్టా'లో పరిచయంతో ప్రేమ

● పెళ్లికి ప్రియుడు నిరాకరణ ● ప్రియురాలి ఆత్మహత్య



లక్ష్మి(ఫైల్)

దోమ, జూలై 23 (ఆంధ్రజ్యోతి):ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువతీయువకులు మూడేళ్లపాటు ప్రేమించుకొని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. చివరకు వారిద్దరి నేనావత్, కెతావత్ గోత్రాలు కలవవని యువకుడు పెళ్లికి నిరాకరించాడు. దీంతో యువతి క్రిమిసంహారక మందుతాగి తనవు చాలించింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. దోమ మండలం పీర్లగుట్టతండాకు చెందిన నేనావత్ సోనిబాయి-హరిచంద్‌ల కూతురు లక్ష్మి(19) తొమ్మితో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్ద టైలరింగ్ చేసేది. తండాలో పని దొరకక హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి వెళ్లి ఓ ఇంట్లో హౌస్‌కీపర్‌గా పని చేసేది. లక్ష్మికి మూడేళ్ల క్రితం సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్‌లో అదే మండలం మోత్కూర్ పరిధి గోన్యానాయక్ తండాకు చెందిన కేతావత్ రాహుల్‌తో పరిచయమేర్పడింది. రాహుల్ హైదరాబాద్‌లోనే ట్యాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరూ ప్రేమించుకొని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. 'కారు తెచ్చుకుందాం. డబ్బులుంటే ఇవ్వు' అని రాహుల్ కొన్ని నెలల క్రితం లక్ష్మిని అడిగాడు. ఆమె గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు తెలియకుండా ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారం, రూ.30వేలు తెచ్చి ఇచ్చింది. రాహుల్ కారుకొని ట్యాక్సీ నడుపుతున్నాడు. ఇదిలా ఉంటే బోనాల పండుగకు లక్ష్మి 15రోజుల క్రితం తండాకొచ్చింది. 20న లక్ష్మికి రాహుల్ ఫోన్ చేసి.. 'మీది నేనావత్, మాది కేతావత్ గోత్రాలు. పెళ్లి చేసుకోవడం కుదరదు. మనం అన్నాచెల్లెల్ల వరసవుతాం.' అని తేల్చిచెప్పాడు. దీంతో లక్ష్మి అతడిని నిలదీసి.. కనీసం తానిచ్చిన బంగారం, డబ్బులైనా ఇవ్వాలని కోరింది. తన దగ్గర డబ్బుల్లేవని రాహుల్ చెప్పాడు. దీంతో లక్ష్మి అదే రోజు ఇంటి ముందు వారి బంధువుల ఇంట్లో క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబీకులు ఆమెను పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి లక్ష్మి చనిపోయింది. లక్ష్మి చేతిపై రాహుల్ అని టాటూ వేసుకుంది. తన కూతురు మృతికి కారణమైన రాహుల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తల్లి సోనిబాయి బుధవారం దోమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పూడూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకున్నామని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సర్కిల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ హరికృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు. ముగ్గురు గంజాయి రవాణా చేస్తున్నట్లు చెన్‌గోముల్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డికి సమాచారం అందిందన్నారు. ఎస్‌ఐ, సిబ్బంది ఎన్కెపల్లి శివారులోని హనుమాన్ ఆలయ సమీపంలో కారు(టీఎస్13ఎఫ్‌బీ6561)ను ఆపి తనిఖీ చేయగా, 1.11కిలోల గంజాయి లభించిందన్నారు. కారులో మన్నెగూడకు చెందిన సలీం, ఎన్కెపల్లికి చెందిన ఇజాజ్ ఖాన్, వికారాబాద్ ప్రాంతానికి చెందిన రాహుల్ ఉన్నారన్నారు. వారిని విచారించగా, బీదర్ నుంచి గంజాయిని తెచ్చినట్టు ఒప్పుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి తప్పించుకున్నాడని చెప్పారు. గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

### ఆటో-బైక్ ఢీ.. ఐదుగురు విద్యార్థులకు గాయాలు

ధారూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులకు, మోటార్ సైకిల్‌పై ఉన్న మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం స్టేషన్ ధారూరు శివారులో జరిగింది. ధారూరు పాఠశాల నుంచి 15 మంది విద్యార్థినులను ఎక్కించుకుని ఆటో స్టేషన్‌ధారూరువైపు వెళ్తోంది. శివారు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్, ఆటో ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న హేమలత(13), ఓంకార్(13), పూజ(14), అక్షయ(13), రేణుక(13)లకు గాయాలయ్యాయి. మోటార్ సైకిల్‌పై ఉన్న ధారూరుకు చెందిన ప్రవీణ్‌కు సైతం గాయాలయ్యాయి. విద్యార్థులను ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స చేయించగా, ప్రవీణ్‌ను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చేర్పించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో నడపటం వల్లే ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఆటో డ్రైవర్ పరారయ్యాడని చెప్పారు. సంఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు

మేడ్చల్ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మేడ్చల్ 7వ ఎంఎం కోర్టు జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష, రూ4వేల జరిమానా విధించారు. దీంతో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు సదరు డ్రైవర్‌ను బుధవారం జైలుకు తరలించారు. ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ మాట్లాడుతూ.. మద్యం తాగి నడిపితే వాహనాన్ని సీజ్‌చేసి, డ్రైవర్‌ను కోర్టుకు అప్పగిస్తామని హెచ్చరించారు. పగటివేళా తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

### రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 4 వద్ద మంగళవారం గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో చనిపోయాడన్నారు. మృతదేహాన్ని గాంధీఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు చెప్పారు. ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

## మాజీ సర్పంచ్‌కి అభినందనల వెల్లువ



ఈశ్వర్‌ను సన్మానిస్తున్న మాల సంఘం నాయకులు

మేడ్చల్ టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పలు సామాజిక కార్యక్రమాలతో గుర్తింపు పొందిన గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్‌ను ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్క రవీంద్రభారతిలో సన్మానించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురు మాల సంఘం నేతలు ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలు కప్పి పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు సంజీవరావు, వెంకటేష్, మాల సంఘం మండల అధ్యక్షుడు లింగాపూర్ మహేష్, అర్జున్, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఇద్దరు ఉపాధ్యాయులకు మెమో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'విధులకు ఉపాధ్యాయులు ఆలస్యం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పం దించారు. డీఈవో ఆదేశాల మేరకు బుధవారం తాండూరు ఎంఈవో వెంకటయ్య గుంతబాస్పల్లి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించి, ఉపాధ్యాయులు జగన్నాథం, సంగీతలకు మెమో జారీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు సమాచారాన్ని ఇచ్చి పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

నవాబుపేట: మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై పుండ్లిక్ హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతొక్కరు సహకరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతుల్లేకుండా ఇసుక, ఎర్రమట్టిని తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మూఢ నమ్మకాలపై పోలీసు కళా బృందాలతో అవగాహన కల్పిస్తామని చెప్పారు.

### వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల: ప్రైవేట్ కంటే మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని బొంరెడ్డిపల్లి, సాల్విడ్, ఘనపూర్, చెల్లాపూర్ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫీవర్ సర్వే ద్వారా బాధితులను గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### 403 మంది బాలికలకు కంటి పరీక్షలు

పరిగి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికలకు ఉచిత కంటి చికిత్సలు చేయడం అభినందనీయమని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్ అన్నారు. ఎవీ కంటి అస్పత్రి సహకారంతో జేకే పెన్సిస్ కంపెనీ పాశమైలారం ఆధ్వర్యంలో పరిగిలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్/కళాశాలలోని 403 మందిబాలికలకు, ఉపాధ్యాయకులు కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి అద్దాలు, మందులను అందజేశారు. వారి ని స్కూల్ తరఫున సన్మానించారు. డీబీసీడబ్ల్యూవో ఉపేందర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కంపెనీలు, సంస్థలు చేయూతను అందించడం గొప్పసేవయని, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు కూడా కంటి జబ్బుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇబ్బందులుంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంపెనీ మేనేజర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ నవనీత, జి.సౌజన్య పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరం

కులకచర్ల: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మందికి కంటి శుక్లాల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ కోసం సికింద్రాబాద్ పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్, నేత్రవైద్య నిపుణులు జవహర్ పాల్గొన్నారు.

### వాహనాలకు నంబర్ ప్లేట్ బిగించుకోవాలి

కులకచర్ల: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై రమేశ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కులకచర్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని 14 ద్విచక్రవాహనాలకు కేసుల నమోదుతో జరిమానాలు విధించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ముందు, వెనకాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలిస్తే సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిషేధిత ప్రాంతాల్లో వాహనాలను నిలపొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.